


## సభలో నవ్వరాదు

శ్రీ రాముని పట్టాభిషేకం జరుగుతున్నది. శ్రీ రాముని యడమ తొడమీద పట్టమహిషి సీతాదేవి కూచుని వున్నది. కుడివేపు పెద్ద తమ్ముడు భరతుడు వింజామర వీస్తున్నాడు. యెడమవేపు రెండవ తమ్ముడు లక్ష్మణుడు రాజలాంఛనం చామరము పట్టుకుని విసురుతున్నాడు. మూడవ తమ్ముడు మరొక రాజలాంఛనం పట్టుకుని కుడివేపు భరతుని వెనకగా నిలబడి వున్నాడు. హనుమ నేలమీద మోకాలాన్చి పాదం వెనక్కి వుంచి, కుడి కాలు వంచి సరిగా కూచుని పట్టుదిండుతో వున్న చిన్న పీఠం మీదున్న రాముని కుడిపాదానికి చేతులాన్చి భక్తి వెల్లడిస్తున్నాడు. ముత్యాల గొడుగు కింద బంగారు సింహాసనం మీద రాముడు నిండైన విగ్రహం సుందరంగా కనబడుతున్నాడు.

సీతారాములను బాగా అలంకరించారు.

సభ నిండి వున్నది. భక్తులు, ఆశ్రితులు, సామంతులు, బంధువులు, రాజ గురువు, గురువులు, విశ్వామిత్ర, పురోహితులు, సభికులు పురజనులు, పట్టాభిషేకానికి వన్నె తెచ్చి సభనిండి వుండి వేయికళ్ల ఆనందంతో వెలుగుతున్నాయి.

హారతి సిద్ధంగా వున్నది. వూదొత్తులు సుగంధ పొగలు వదులుతున్నాయి. పూల చేరులు, పూలదండలు, బహుమానాలు దండిగా వున్నాయి.

లక్ష్మనునికి నవ్వు వచ్చింది. చిరునవ్వు చిందించాడు. ఆ నవ్వుని, నిండు సభలోని వారంతా గమనించారు.

రాముడనుకున్నాడు. '' ఇంత పెద్ద సభలో పెళ్లాన్ని తొడమీద కూచోబెట్టుకున్నాడు అన్న''. సీతాదేవి అనుకున్నది. ''చేజేతులా కష్టం తెచ్చిపెట్టుకుని రాముని లేడి తెమ్మని పంపి, నన్ను దూషించి పంపేసి రావణునికి చిక్కింది. రాముడు సమర్ధుడు గనక శత్రు సంహారం చేసి, భార్యను తెచ్చుకున్నాడు. వదిన పొరపాటును దిద్దాడు''.

భరతుడనుకున్నాడు. ''తల్లి మూర్ఖించి సంపాయించి యిచ్చిన రాజ్యమేలాడు. తనకిష్టం లేదని అయోధ్యావాసులనుకోవాలని వేషం వేసి నందిగ్రామంలో వున్నాడు. నా వలె అన్న వెంట అడవులకు వచ్చాడా? ఇవాళ చామరం వీస్తున్నాడు''.

వశిష్ఠుడనుకున్నాడు. '' ఒకసారి పెట్టిన సుముహూర్తానికి రాముడడవుల పాలైనాడు. ఈమాటెటువంటి ముహూర్తం పెట్టాడో!''.

ఇలా అందరూ లక్ష్మణుని గురించి తలొకరకంగా అపోహపడి తమను చూసే నవ్వుతున్నాడనుకున్నారు.

చివరికి రాజగురువు వసిష్ఠుడే తనకడిగే అధికారమున్నదని తలచి లేచివచ్చి లక్ష్మణుని అడిగాడు.

''యెందుకు నవ్వావో చెప్పాలి లక్ష్మణా! మేమేమీ తప్పు పట్టము. నిందించము. తెలుసుకుంటాము. కనక చెప్పి తీరాలి''.

లక్ష్మణుడు చామరం కింద వుంచి, గురువు పాదాలకు వందనం చేసి నవ్వుమొహంతోనే చెప్పాడు.

''రాముడరణ్యవాసానికి వెళ్తున్నప్పుడు, నేను గూడా వెళ్లి, సేవ చేస్తూ, సాయపడుతూ, రాత్రీ పగలూ మేలుకుని వుండి కాపలా కాయాలని వుండి, నిద్ర దేవతకు మొక్కి వేడుకున్నాను. ''తల్లీ! నిద్ర దేవతా! నేటినుంచీ, రాముని అరణ్యవాసమైపోయి పట్టాభిషేకం జరిగేవరకూ నా దరికి రావోకు'' అన్నాను గురూ. ''వరమిచ్చి నిద్రాదేవత నవ్వుతూ అడిగింది. యెక్కడుండమన్నావూ?'' ''నా భార్య ఊర్మిళనావహించి వుండు. ఊర్మిళకప్పుడు నా వియోగ బాధ తెలియదు'' అన్నాను. ''సరే'' అని ఆశీర్వదించి వెళ్లిపోయింది.

''కాని గురూ, నిద్రాదేవత గుర్తుపెట్టుకుని, అరణ్యవాసం పూర్తి అయి, సరీగ్గా రాముని పట్టాభిషేక దినాన పట్టాభిషేకం మొదలుకాగానే వచ్చి నన్నావహించింది. నిన్నటితో గడువైపోయింది అని తేల్చింది నిద్రాదేవత. రాత్రికి

వచ్చి నిద్రాదేవత నన్నావహించవచ్చుగా అని నవ్వు వచ్చింది గురూ'' బరువైన రెప్పలు, నిద్రకు వాలుతుండగా, నిద్రకు తూలుతూ, బలవంతంగా కళ్లు దెరిచి చూస్తూ అన్నాడు లక్ష్మణకుమారుడు.

''అయ్యో! నిర్దోషిని గురించి అపోహపడ్డామె!'' అని చింతించారు సభికులంతా రామునితో సహా.